# జాతీయ ఫైబర్ విధానం 2010 – చేనేత రంగంపై దుష్ప్రభావం

జాతీయ ఫైబర్ విధానం యొక్క అవసరం ఎంతైన వుంది. ఈ విధానం దేశంలో ఉత్పత్తి అవుతున్న అన్ని రకాల నూలుపోగులకు సంబంధించినది. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఈ విధాన రూపకల్పనకు గత ఏడాది జూలై నెలలో శ్రీకారం చుట్టింది. దీనిని రూపొందించడానికి ఒక కమిటిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటిలో 72 మంది సభ్యులను ఎంపిక చేసుకోవటం జరిగింది. కాకపోతే, ఈ కమిటిలో పూర్తిగా కార్పోరేట్ సంస్థలు మరియు కంపెనీలకు సంబంధించిన వ్యక్తులనే తీసుకున్నారు. ఈ కమిటీలో చేనేత పరిశ్రమకు సంబంధించి ఒక్క ప్రతినిధికి కూడా చోటు దక్కలేదు. రైతుల ప్రతినిధులు కూడా ఇందులో లేరు. ప్రభుత్వ నిధులతో ఒక విదేశీ కంపెని ఈ కమిటికి విజ్ఞాన, సమాచార సేవలు అందించింది. ఈ ఏడాది జూన్ నెలలో ముసాయిదా విధానం విడుదల చేయడం జరిగింది.

ఈ ముసాయిదా కేవలం ఇంటర్నెట్ లో పెట్టడం జరిగింది. దినిపై వ్యాఖ్యానించడానికి మొదట పది రోజుల గడువు మాత్రమే ఇవ్వడం జరిగింది, దీనిని సవాలు చేస్తే, అప్పడు గడువు పొడిగించడం జరిగింది. జూలై మాసాంతానికి ఈ ప్రక్రియ కూడా ముగిసింది. తదుపరి, ప్రభుత్వం ఏమి చేస్తుంది, ఎలా ఈ ముసాయిదాను విధానముగా మారుస్తారు అనేది ఇంకా అంతు పట్టని విషయం. అయినా ఇప్పటికి, అనేక మందికి ఈ విధానం గురించి గాని, దాని నేపథ్యం గురించి గాని తెలిసే అవకాశం లేదు. అందరికి తెలియ చెప్పాలనే తపన ప్రభుత్వ స్థాయిలో కనపడడం లేదు. అంతకు ముందు ప్రతి సమావేశంలో దిని గురించి ఊదరగొట్టిన కేంద్ర జౌళి శాఖా మంత్రి, శ్రీ దయానిధి మారన్ గారు, ముసాయిదా గురించి ఎక్కడ ప్రస్తావించకపోవడం గమనార్హం. ఈ ముసాయిదా లోని మంచి చెడ్డలు విస్తృతంగా చర్చిస్తేనే అందరికీ ఆమోదయోగ్యమైన విధానం రూపొందే అవకాశం ఉంటుంది.

ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ఈ విధానం ముసాయిదా తీవ్ర నిరాశను మిగిల్చింది. కొత్త పంథా గాని, కొత్త రూపు గాని ఈ విధానంలో మనకు కనపడలేదు. భారత జౌళి రంగంలో ఉన్న అనేక ఉపరంగాల మధ్య గల వైరుధ్యాలను అర్ధం చేసుకొని వాటిమధ్య ఒక సమన్వయం సాధించే దిశగా ఈ ముసాయిదా ఎటువంటి ప్రయత్నము చేయకపోవడము మనకు స్పష్టంగా కనపడుతుంది. పర్యావరణ అనుకుల భారత ప్రభుత్వ ఆలోచనలకూ భిన్నంగా ఈ ముసాయిదా రూపొందించబడింది. మొత్తానికి, ఈ ముసాయిదా ప్రత్తి మరియు కృత్రిమ నూలు మధ్య ఉన్న నిష్పత్తిని మార్చే ప్రయత్నం చేస్తున్నది – కృత్రిమ నూలు ఉత్పత్తిని పెంచి, ప్రత్తిపై ఆధారపడడాన్ని తగ్గించి ఆధునిక జౌళి రంగ అభివృద్ధి సాధించాలని ఈ జాతీయ ఫైబర్ ముసాయిదా విధానం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

అంతర్జాతీయంగా ప్రస్తుతం ఉన్న ప్రత్తి మరియు కృత్రిమ నూలు ఉత్పతి మధ్య ఉన్న నిష్పత్తిని అందుకోవాలని స్పష్టంగా చెప్పబడింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఈ నిష్పత్తి 40:60 ఉండగా దేశంలో ఇది 59:41గా ఉన్నది. అంటే, ప్రత్తి ఉత్పత్తి

 డా. డీ. నరసింహా రెడ్డి, ప్రముఖ జౌళి రంగ విశ్లేషకులు, nreddy.donthi@gmail.com

కృత్రిమ నూలుతో పోలిస్తే మన దేశంలో ఎక్కువ. అంతర్జాతీయంగా తక్కువ. కాకపోతే కృత్రిమ నూలు ఉత్పత్తి ఎందుకు ఎక్కువ చేయాలనే విషయం మీద సరైన వివరణ ఇందులో లేదు.

భారత దేశం ప్రత్తి ఉత్పత్తిలో ప్రపంచ స్థాయిలో రెండవ స్థానంలో ఉంది. 2008లో జరిగిన ఉత్పత్తి 5 బిలియన్ కేజీలు. ప్రత్తి నూలు మరియు ప్రత్తి ఆధార వస్త్ర ఉత్పత్తి లో కూడా అగ్రగామి. 17 మిలియన్ కేజీల ఉత్పత్తి ద్వార సిల్క్ లో కూడా రెండవ స్థాయిలో ఉంది. జనపనార ఉత్పత్తి 1.7 బిలియన్ కేజీలు చేరుకొని ప్రపంచంలో మొదటి స్థాయిలో ఉంది. ఈ విధముగా జౌళి రంగంలోని అన్ని ఉపరంగాలలో భారత దేశం యొక్క స్తానం చాల అత్యున్నత స్తాయిలోనే ఉన్నది. ఏ దేశంలో కూడా ఇన్ని రకాల ఫైబర్ ఉత్పత్తులు చేసే సామర్ధ్యం పూర్తిగా లేదు. అన్ని రకాల ఫైబర్ ఉత్పత్తులలో సంపూర్ణముగా ముడిపదార్ధాల ఉత్పత్తినుంచి, వాటిని ఉపయోగించి తయారుచేసే జౌళి ఉత్పత్తుల దాక భారత దేశం అగ్రగామిగా కొనసాగుతున్నది. వీటిని ఉత్పత్తి చేసే పద్ధతులు కూడా అనేకం. వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానం మన సొంతం. చేతి మగ్గంపై నేసిన వస్త్రాల నుంచి మిల్లుల వరకు ఈ దేశంలో అనేక రకాలుగా నైపుణ్యం కనపడుతుంది. ఇంతటి వైవిద్యం కలిగిన భారత జౌళి రంగంలో కనీసం 10 కోట్ల మంది కేవలం సహజ ఫైబర్ ఉత్పత్తుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. సహజ ఫైబర్ ఉత్పత్తులలో ప్రత్తి, సిల్క్, జుట్, ఉన్ని, అరటి వంటి అనేక రకాల వ్యవసాయ పంటలున్నాయి. ఈ వ్యవసాయ ఉత్పత్తులనించి నార తీసి, నూలు తయారుచేసే కుటీర, చిన్న, పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. ఈ నూలు నుంచి జౌళి మరియు వస్త్రాలు తాయారు చేసే చేనేత పారిశ్రామికులు, మరియు పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. అన్ని రంగాలు అన్ని రాష్ట్రాలలో వివిధ స్థాయిలలో ఉండడం మనకు చిరపరిచితమే.

1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు సందర్భముగా జరిగిన ఒప్పందాలలో భాగముగా భారత ప్రభుత్వము దేశీయ జౌళి రంగాన్ని సంస్కరించ పూనుకున్నది. 2005లో ప్రపంచవ్యాప్తముగా స్వేచ్ఛా వస్త్ర వాణిజ్యం అమలులోకి వచ్చిన తర్వాత కూడా సంస్కరణల పరంపర కొనసాగింది. ఎగుమతుల ద్వార భారత జౌళి రంగము ఇంకా వేగముగా అభివృది చెందే అవకాశాలున్నాయని జౌళి విధానాలలో మార్పులు తీసుకుని రావడం జరిగింది. ఈ మార్పులలో కుటీర, చిన్న మరియు చేనేత రంగాలకు ప్రాధాన్యం కలిపించలేదు. గత పదేళ్లలో, పెద్ద పారిశ్రామికులకు ఆధునీకరణ పేరుతో దాదాపు లక్ష కోట్ల రూపాయల రాయితీలు, సబ్సీడులు మరియు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరిగింది. ఇంకా రాయితీలు, సబ్సీడులు మరియు ప్రోత్సాహకాలు కల్పించే దిశగా జాతీయ ఫైబర్ విధానం రూపొందించబడింది. ఇప్పటికే, గత పదేళ్ళ విధానపర వివక్షతో కుదేలైన చేనేత పరిశ్రమ, దాని మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఇది గొడ్డలిపెట్టు.

ఈ ముసాయిదాలో ప్రత్తి ఉత్పత్తి పెరిగి, మిగులు ఉన్నది అని చెప్పినా, ప్రస్తుతం నూలు ధరలు ఎందుకు పెరుగుతున్నాయో చెప్పలేదు. ఈ విధానం పూర్తిగా కృత్తిమ నూలు ఉత్పత్తికి, పాలియెస్టర్ వస్త్ర పరిశ్రమకు ప్రయోజనం

చేకూర్చడానికే అని ముసాయిదాలో స్పష్టంగా చెప్పబడింది. అనగా MMF ఉత్పత్తుల ఖర్చులు తగ్గించే ప్రయత్నము ఈ విధానం ద్వార చెయ్యడానికి ప్రభుత్వము నిర్ణయించింది. సహజ ఫైబర్ ఉత్పత్తులు గురించి పట్టించుకోకుండా MMF గురించి మాత్రమే స్పందించడం సరియైన నిర్ణయము కాదు. దాదాపు పది కోట్ల చిన్న, సన్నకారు రైతులు మరియు చేనేత కార్మిక కుటుంబాల యొక్క పరిస్థితి చక్కదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది.

MMF ఉత్పత్తి పెరగడం వల్ల పర్యావరణ వినాశనం పెరుగుతుంది. అందులో వాడె రసాయనాలు, ఇంధనాలు మరియు కరెంటు వలన అనేక పర్యావరణ అనర్థాలు. పాలియెస్టర్ వస్త్రాలు ధరించడము వల్ల ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే భారత దేశంలో అలెర్జీలు, చర్మరోగాలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

జాతీయ జౌళి విధానం 2000 మరియు ఈ విధానం మధ్య సమన్వయము గాని సారూప్యం గాని కనపడదు. ప్రతిపాదించిన ఒక కొత్త విధానం వచ్చినప్పుడు, పాత విధానంలోని లోపాలను గాని, అనుభవాలనుగాని, కొత్త పరిస్తితులనుగాని పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది. జాతీయ ఫైబర్ విధాన రూపకల్పనలో అటువంటి ప్రక్రియ జరగలేదు. అనేక విషయాలలో దూరదృష్టి మరియు సమదృష్టి లోపించిన జాతీయ జౌళి విధానం యొక్క గుణాలను, జాతీయ ఫైబర్ విధాన ముసాయిదాలో మాత్రం ప్రతిబింబించే అంశాలు మనకు కనబడతాయి.

అన్ని రకాల సహజ ఫైబర్ నూలు ఉపయోగించి అనేక రకాల జౌళి ఉత్పత్తులను తయారు చేసే సామర్థ్యం కేవలం చేనేత రంగానికే ఉన్నది. ఈ నిజాన్ని ప్రభుత్వం విస్మరించడం విస్మయం కలిగిస్తున్నది. కేవలం బడా కార్పోరేట్ సంస్థల ప్రాతినిధ్యం ద్వార, వారికే మేలు చెయ్యడానికి ఈ ప్రక్రియ మొదలుపెట్టటం ప్రజాస్వామ్యంలో అక్షేపించదగింది.

జాతీయ ఫైబర్ విధానంలో చేనేతకు స్థానంలేదు అని చెప్పడం ద్వార కేంద్ర జౌళి శాఖా మంత్రి, శ్రీ దయానిధి మారన్ గారు, భారత జౌళి రంగంలో ప్రభుత్వ ఆలోచనలను బహిర్గతం చేశారు. అన్ని రకాల సహజ ఫైబర్ నూలు ఉపయోగంలో ముఖ్య భూమిక వహిస్తున్న చేనేతకు స్థానం లేదు అనడం భరించరానిది. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

పోటి సామర్థ్యం పెంచాలంటే వైవిధ్యాన్ని కాపాడుకొంటూ, వివిధ ఉపరంగాలమధ్య సమన్వయము ఏర్పరిచి, అన్ని ఉపరంగాల అంతర్గత సమస్యలు పరిష్కరించి, ఉత్పత్తి ఖర్చులను తగ్గించాలి. కాని, ఈ ముసాయిదా జాతీయ ఫైబర్ విధానం ఉపరంగాల మధ్య ప్రభుత్వ సబ్సిడీలకోరకు పోటీ పెంచి తదనంతరం రాజకీయ లబ్ది పొందే విధంగా రూపొందించారు.

కాకపోతే, ఉత్పత్తి ఖర్చులో సింహ భాగము పెరుగుతున్న నూలు ధరలే ఆక్రమిస్తుంటే, చిన్న ఉత్పత్తిదారులు పోటీలో నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపే సరికొత్త ఆలోచన ఏది ఈ

ముసాయిదాలో ప్రతిపాదించబడలేదు. ఇంకొక ఉద్దేశ్యము ఉత్పత్తి గొలుసులో ఉన్న అందరు భాగస్వాములకు తగిన విధముగా లాభాలు పెంచాలని కూడా ఉన్నది. ఈ ఉద్దేశ్యానికి అనుగుణంగా తగిన విధముగా, చిన్న రైతులకు, చిన్న ఉత్పత్తిదారులకు మరియు చేనేత పారిశ్రామికులకు మేలు చేకూర్చే ప్రతిపాదన మాత్రం ఒక్కటి కూడా ఇందులో లేదు.

ఈ విధానం యొక్క దృష్టి ఆయా జౌళి ఉపరంగాలకు మేలుచేసే విధంగా కాకుండా, జాతీయ జౌళి పరిశ్రమ దీర్ఘకాలిక ప్రయోజనాలు కాపాడే విధంగా కాకుండా, కేవలం కొన్ని బడా, వ్యక్తిగత పరిశ్రమ లాభాలు పెంచే విధముగా రూపొందించబడింది. కొన్ని పెద్ద వ్యాపార వర్గాల గుత్తాధిపత్యాన్ని కొనసాగించటానికి ఇందులోని ప్రతిపాదనలు ఉపయోగపడతాయి. భారత జౌళి రంగం ఆధునికం దిశగా పయనించడం సరి కాదు. జాతీయ ఫైబర్ విధానంలో ఆ దిశగా అడుగులు వేసే ప్రతిపాదనలు చెయ్యటం ఆత్మహత్యాసదృశ్యం. గత పదేళ్లలో జాతీయ జౌళి విధానంవల్ల అనేక ప్రాంతాలలో అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయ్యాయి. పేదరికం పెరిగింది. నిపుణులు కనుమరుగు అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో జాతీయ ఫైబర్ విధానం చక్కదిద్దే ప్రతిపాదనలు చెయ్యకుండా గోరుచుట్టుపై రోకటి పోటు లాగ MMF/కృత్రిమ నూలు అభివృద్ధి బాట పట్టడం అత్యంత భాధాకరం.

ఇందులో ప్రతిపాదించిన నూలు సలహా బోర్డు కేవలం చిలపల నూలు సమాచార సేకరణ మరియు క్రోడీకరణ కొరకే. దీని వలన చేనేత రంగానికి అవసరమైన స్థాయిలో చిలపల నూలు అందుబాటులోకి వస్తుందా అనే అనుమానం ఒక పక్క ఉండగా, అసలు ఈ ప్రతిపాదన సరియైనది కాదంటూ మిల్లులు మరియు స్పిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు వాఖ్యానించడం గమనార్హం. ప్రభుత్వానికి చేనేత రంగానికి అవసరమైన చిలపల నూలు అందించాలని చిత్తశుద్ధి ఉంటె, ఈ ముసాయిదాలో ప్రతిపాదించిన విధముగా నూలు సలహా బోర్డు ఏర్పాటు చేసి, దాని విధి విధానాలు విస్తృతపరిచి, చిలపల నూలుకు సంబంధించి అన్ని చర్యలు చేపట్టాలి.

కృత్రిమ నూలుకు, పాలియస్టర్ వస్త్రాల ఉత్పత్తికి ప్రోత్సహించే ఈ ముసాయిదా వలన పేద ప్రజలు సహజ నూలు వస్త్రాలు కొనే స్తోమత కోల్పోతారు. ఒక్కప్పుడు, 80వ దశకంలో, ప్రభుత్వం ఒక నినాదం తీసుకు వచ్చింది – "పేదలకు ప్రత్తి వస్త్రాలు, ధనికులకు పాలియస్టర్ వస్త్రాలు". గత పదేళ్లలో ఈ పరిస్థితి తారుమారు అయ్యింది. ప్రస్తుత ప్రతిపాదించిన జాతీయ ఫైబర్ విధానం వల్ల ఈ నినాదం మార్చాల్సిన పరిస్థితి వస్తుంది – పేదలకు పాలియస్టర్ వస్త్రాలు, ధనికులకు ప్రత్తి వస్త్రాలు. ఈ పరిస్థితి ఉత్పన్నమైతే పేద వినియోగ వర్గాలు అత్యంత దుర్బల పరిస్థితులలో పనిచేసేవారు పాలియస్టర్ వస్త్రాలు ధరించడము వలన అనారోగ్య పరిస్థితులకు గురి అవుతారు. దేశంలో ప్రత్తి వస్త్రాల వినియోగం తగ్గిపోతుంది. తదనుగుణంగా, ప్రత్తి వస్త్రాల ఉత్పత్తి పై ఆధారపడి జీవించే అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోతాయి.

ఈ ప్రకారముగా, మార్కెట్లో వివిధ రకాల ఉత్పత్తి రంగాలకు ఉన్న వాటాలను జాతీయ ఫైబర్ విధానం ప్రభావితం చేస్తుంది. పెద్ద పారిశ్రామికులకు అనుగుణంగా, వారి మార్కెట్ వాటాలను పెంచే విధంగా ఈ విధానం రూపొందించారు. ఇది ఫైబర్ న్యూట్రల్ విధానం అని చెబుతూనే, నిష్పక్ష విధానం అవసరం అని చెబుతూనే, పూర్తిగా MMF/కృత్రిమ నూలుకు ప్రోత్సాహమివ్వడం ఈ విధానంలో మనం గమనించాల్సిన ముఖ్య విషయం.

క్లుప్తంగా, ఈ విధానం లోపభుయిష్టముగా ఉన్నది. దీని వలన ఉపాధి తగ్గవచ్చు, దిగుమతులు పెరగవచ్చు, పర్యావరణ విధ్వంసం పెరగవచ్చు మరియు దేశీయ పరిశ్రమ ప్రమాదంలో పడవచ్చు. ఈ విధానము దేశీయ జౌళి పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తి స్థాయిలో అర్థం చేసుకోలేదు. చూపిన పరిష్కారాలు విజ్ఞతతో చేసినవి కావు. దీర్ఘకాలిక దేశీయ ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని చెప్పినవి కావు. ఈ ముసాయిదా జాతీయ ఫైబర్ విధానము సరి చెయ్యాలంటే, దీనిపైన విస్తృత చర్చలు చెయ్యాల్సిన అవసరము ఎంతైన ఉంది. చిన్న, సన్నకారు రైతులు మరియు చేనేత కార్మిక కుటుంబాల సమస్యలు మరియు పరిష్కారాలు ఇందులో మిళితంచేసి ఒక సమగ్ర విధానం రూపకల్పన చెయ్యాలి. దేశీయ జౌళి రంగంలోని అన్ని ఉప రంగాల ప్రయోజనాలు కాపాడాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఈ విధానం అమలులోకి వస్తే భారత జౌళి రంగం యొక్క స్వరూపం మారిపోయే అవకాశం ఉన్నది. మొదటగా, చిన్న ఉత్పత్తిదారులు కనుమరుగు అవుతారు. రెండవ దశలో దిగుమతులు మరియు విదేశీ ఉత్పత్తులు పెరిగిపోతాయి. ఈ రెండు దశల క్రమంలో సహజ నూలు ఉత్పత్తులు 60 శాతం దేశ ప్రజలకు అందుబాటులో ఉండవు.

స్థూలంగా, వస్త్ర ఉత్పత్తిని మరియు వినియోగాన్ని పూర్తి స్థాయిలో, సంపూర్ణంగా మార్చే ఇటువంటి విధానం వల్ల ఉన్న ఉపాధి కోల్పోయి, వినియోగంలో స్వావలంబన కోల్పోయి, స్వతంత్ర జౌళి రంగం ఉనికి కోల్పోయి, విదేశీ ఉత్పత్తుల మీద ఆధారపడే పరిస్థితి వచ్చే ప్రమాదము ఈ జాతీయ ఫైబర్ విధానం వల్ల ఉన్నప్పుడు, దీనిని పునరాలోచించి, విస్తృత చర్చలు జరిపి, అందరి అభిప్రాయాలు తీసుకొని ఒక ఆమోదయోగ్యమైన విధానము తీసుకురావాల్సిన అవసరము ఎంతైన ఉంది.

దేశీయ జౌళి రంగం యొక్క ప్రాశస్త్యం సహజ నూలు ఉత్పత్తులు కనుక వీటిని ప్రోత్సహించేలా వ్యూహాలు పొందుపరచాలి. మార్కెట్లో వినియోగదారులు మోసపోకుండా జౌళి ఉత్పత్తులకు లేబులింగ్ చట్టం తీసుకురావాలి. సహజ నూలుకోరకు ఒక నిధిని (Natural Fibre Fund) ఏర్పాటు చెయ్యాలి. నూలు ధరల స్థిరీకరణ కొరకు ప్రత్యేక నియంత్రణ యంత్రాంగం ఏర్పాటు చెయ్యాలి.